
సాక్షి అనంతపురం

శుక్రవారం ၊ 9 ၊ ఆగస్టు ၊ 2024



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి.



కిలో టమాట రూ.25

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.25, కనిష్టం రూ.8 ప్రకారం ధర పలికింది.



జిల్లా అంతటా గురువారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

జైఎస్ఎన్ఎల్!



సర్వీస్ ప్రొవైడర్లు భారీగా చార్జీలు పెంచడంతో మొబైల్ వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. ఒక్కసారిగా 40 శాతం నుంచి 50 శాతం వరకూ టారిఫ్‌లు పెరగడంతో కుయ్యోమొర్రో అంటున్నారు. అంత ఖర్చు చేయలేక, మొబైల్ వినియోగం మానేయలేక వారి పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలోనే టారిఫ్ తక్కువగా ఉన్న బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపుతున్నారు.

- బీఎస్ఎన్ఎల్ వైపు.. వినియోగదారుల చూపు
- గత 35 రోజుల్లోనే ఉమ్మడి అనంతలో 25 వేల మంది షిఫ్ట్
- ఇందులో 70 శాతం మంది జియో వినియోగదారులే
- టారిఫ్ రేట్లు భారీగా పెరగడంతోనే అటువైపు మొగ్గు
- ఇప్పటికీ 4జీ సేవల్లో వెనుకంజలో బీఎస్ఎన్ఎల్
- ఇంటర్నెట్ సేవల్లో స్పీడు పెంచితే మళ్లీ పూర్వ వైభవం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది బీఎస్ఎన్ఎల్ వైపు పరుగులు తీస్తున్నారు. ప్రైవేటు సర్వీస్ ప్రొవైడర్ల టారిఫ్ ఛార్జీలు భారమయ్యాయని, అందుకే మారుతున్నట్టు చెబుతున్నారు. రెండు లేదా మూడు సిమ్‌లు ఉన్న వారు ఒక్క సిమ్‌తో సరిపెట్టుకుంటున్న పరిస్థితి. కొత్తగా కొనేందుకు కొందరు, పోర్టు ద్వారా మార్చుకునే వారు ఇంకొందరు ఇలా బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డులకు క్యూ కడుతున్నారు.

జియో కస్టమర్లే ఎక్కువ..

సరిగ్గా జూలై 1న జియో, ఎయిర్‌టెల్ సంస్థలు టారిఫ్ రేట్లను భారీగా పెంచాయి. నెలకు రూ.249 ఉన్న రేటు రూ.349 చేశాయి. ప్యాకేజీల వారీగా ఈ రేట్లు పెరిగిపోయాయి. దీంతో వినియోదారులు బెంబేలెత్తిపోయారు. టారిఫ్‌లు పెంచని బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపడం ప్రారంభించారు. జూలై ఒకటో తేదీనుంచి 31వ తేదీకి అంటే కేవలం ఒక్క నెలలోనే 20 వేల మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్‌కు మారారు. ఆగస్టు 7 నాటికి మరో 5 వేల మంది సిమ్ తీసుకున్నారు. మారిన కస్టమర్లలో 70 శాతం మంది జియో నుంచి, 30 శాతం మంది ఎయిర్‌టెల్ నుంచి వచ్చిన వారున్నారు. రానున్న మూడు, నాలుగు నెలల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సిమ్ ధర ఎక్కువైనా..

రెండు నెలల క్రితం బీఎస్ఎన్ఎల్ సిబ్బంది కేవలం రూ. 30కు సిమ్‌కార్డు ఇస్తామన్నా ముందుకురాని కస్టమర్లు ఇప్పుడు రూ.150 పెట్టి మరీ కొంటున్నారు. దీంతో బీఎస్ఎన్ఎల్ అధికారులే ఆశ్చర్యపోతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో నెల మొత్తం వెయ్యి సిమ్‌కార్డులు అమ్మితే గొప్పగా ఉండేది. ఈ క్రమంలో గత నెలలోనే 20 వేల సిమ్ కార్డులు అమ్ముడుబోవడం చూసి వారే నోరెళ్లబెడుతున్నారు. ఇదిలా ఉండగా 4జీ సేవలు, 5జీ సేవలు అందుబాటులోకి తెచ్చి, ఇంటర్నెట్ సేవల వినియోగంలో మరింత పురోగతి చూపితే బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం వస్తుందని కస్టమర్లు అంటున్నారు.



జూలై నెలలో వివిధ సర్వీసుల నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మారిన కస్టమర్లు

జోన్	పోర్ట్‌కు వెళ్లినవి	కొత్త సిమ్‌లు
అనంతపురం	1,577	801
హిందూపురం	1,394	648
కదిరి	1,499	746
గుంతకల్లు	1,910	1,091
రాయదుర్గం	2,092	951
తాడిపత్రి	1,971	1,064
అనంతపురం-2	1,114	242

ఆగస్టు 1 నుంచి 7 వరకూ..

బీఎస్ఎన్ఎల్‌కు పోర్ట్	3,480
కొత్త సిమ్‌కార్డులు	1,727

సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చిన తాజా ప్యాకేజీలో ఒకటి ఇలా..

ప్రొవైడర్	గడువు	ప్యాకేజీ	సామర్థ్యం
బీఎస్ఎన్ఎల్	82 రోజులు	రూ.485	1.5 జీబీ
ఎయిర్‌టెల్	84 రోజులు	రూ.859	1.5 జీబీ
జియో	82 రోజులు	రూ.859	1.5 జీబీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొబైల్ ఫోన్లు..

స్మార్ట్ ఫోన్లు	14 లక్షలు
కీప్యాడ్ ఫోన్లు	8 లక్షలు
మొత్తం	22 లక్షలు
సగటున నెలకు బిల్లు	రూ.55 కోట్లు (రూ.250తో అయితే)
ఏడాది బిల్లు	రూ.660 కోట్లు

టవర్ల సామర్థ్యాన్ని పెంచుతాం



వినియోగదారుల డిమాండును దృష్టిలో ఉంచుకుని 4జీ సామర్థ్యాన్ని పెంచుతాం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 556 టవర్లు ఉన్నాయి. కొత్తగా 63 టవర్లు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని టవర్లను 4జీలోకి తీసుకువస్తున్నాం. డిసెంబర్‌లోగా ప్రక్రియ పూర్తవుతుంది. టవర్ల సామర్థ్యం పెంపుతో వినియోగదారులకు నెట్‌వర్క్ సమస్య తీరుతుంది. రాబోవు రోజుల్లో బీఎస్ఎన్ఎల్‌కు ఎదురుండదు. మారుమూల ప్రాంతాలకు సైతం నాణ్యమైన, అత్యంత వేగంతో సిగ్నల్స్ అందేలా చర్యలు తీసుకుంటున్నాం.

– షేక్ ముజీబ్ పాషా, ఉమ్మడి జిల్లా బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్

న్యూస్‌రీల్

‘ఈ క్రాప్’ చేయించుకోండి

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ సూచన



వివరాలు తెలుసుకుంటున్న డీఏఓ

బుక్కరాయసముద్రం: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో ఈ- క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. మండలంలో ఎంత మంది రైతులు ఉన్నారు, ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు తదితర వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్రాప్ చేయించుకుంటేనే పంట నష్ట పరిహారం, రైతు భరోసా, ఇన్సూరెన్స్ పొందేందుకు అర్హులన్నారు. సెప్టెంబర్ 19 నుంచి 24వ తేదీ వరకు సామాజిక తనిఖీ జరుగుతుందని, తనిఖీలో అందే ఫిర్యాదులను 25 నుంచి 28 తేదీల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు 5 మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతపురం టౌన్: బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని 220 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం 5 మండలాలతో పాటు అనంతపురం నగరంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, నార్పల, శింగనమల, అనంతపురం రూరల్ మండలంతో పాటు నగరంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు.

100 రోజుల్లో 5 వేల ఇళ్ల నిర్మాణాలు

అనంతపురం టౌన్: జిల్లా వ్యాప్తంగా 100 రోజుల్లో 5 వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక గృహ నిర్మాణ సంస్థ కార్యాలయాన్ని పరిశీలించారు. డ్వామా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పీఎంఏవై ఇళ్ల వద్ద ప్రభుత్వం నిర్దేశించిన నేమ్ బోర్డులను విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు నివేదికలను అందజేయాలని ప్రాజెక్టు డైరెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈలు కృష్ణారావు, శ్రీమన్నారాయణ, విజయభాస్కర్, రంగస్వామి, హనుమప్ప తదితరులున్నారు.

నిండుకుండలా టీబీ డ్యాం



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నిండుకుండను తలపిస్తోంది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో ఉన్న శివమొగ్గ, పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం సాయంత్రం నాటికి 48,439 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరాయి. ఈ క్రమంలో 5 క్రస్ట్ గేట్లు ఒక్క అడుగు మేర ఎత్తి నది, కాలువలకు కలిపి మొత్తం 24,944 క్యూసెక్కుల నీటిని బయటికి వదులుతున్నారు.

నేడు ‘దుర్గం’లో రైల్వేస్టేషన్ నూతన భవనం ప్రారంభం



రాయదుర్గం నూతన రైల్వేస్టేషన్ భవనం

రాయదుర్గంటౌన్: పట్టణంలో రైల్వేస్టేషన్ నూతన భవనాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్టన్ రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జగదీష్‌సాయి మాట్లాడుతూ నూతన భవనాన్ని రూ.9.2 కోట్లతో నిర్మించినట్లు చెప్పారు. ప్రస్తుతం ట్రాక్ 730 మీటర్ల మేర ఉన్నదన్నారు. రైళ్ల రాకపోకల సిగ్నలింగ్ వ్యవస్థను కొత్త భవనంలో ప్రారంభిస్తామన్నారు. స్టేషన్‌లో పలు పనుల కారణంగా శుక్రవారం మూడు రైళ్ల రాకపోకలను రద్దు చేసినట్లు వివరించారు. స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాం అభివృద్ధికి రూ.8.72 కోట్లతో టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

అరకొర వసతులతోనే ప్రారంభం..

రైల్వే స్టేషన్‌లో నూతన భవనం ప్రారంభిస్తున్నా అందులో ప్రయాణికులకు తగిన సౌకర్యాలు లేవు. ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు కూర్చొనేందుకు బెంచీలు కూడా ఏర్పాటు చేయలేదు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేని దుస్థితి. వెయిటింగ్ హాల్ ఊసే లేదు. ఒకటో ప్లాట్‌ఫాం నుంచి 2వ ప్లాట్‌ఫాంకు వెళ్లే మార్గంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో భవనం కేవలం ఆరు అడుగులు మాత్రమే ఉంది. అంతేకాక నూతన స్టేషన్ భవనం లోపల తక్కువ విస్తీర్ణం ఉంది. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేలా లేవు. రైల్వే ఉన్నతాధికారులు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నూతన భవనం, ప్లాట్‌ఫాం అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఎక్స్‌ప్రెస్‌లకు స్టేషన్‌లో స్టాపింగ్ వసతి కల్పించాలన్నారు.

15 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో జడివాన కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 15 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. విడపనకల్లు, కణేకల్లు, పెద్దవడుగూరు, బెళుగుప్ప, బుక్కరాయసముద్రం, ఉరవకొండ, శింగనమల, బొమ్మనహాళ్, అనంతపురం, పుట్లూరు, గార్లదిన్నె తదితర మండలాల్లో 5 నుంచి 10 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. మరికొన్ని మండలాల్లో తుంపర్లు పడ్డాయి. ఆగస్టులో సాధారణం 83.8 మి.మీ కాగా ప్రస్తుతానికి 10 మి.మీ వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు కొంత ఊరటనిస్తుండగా, చాలా మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సరిపడా పదును వర్షం నమోదు కాలేదు.

సెంట్రల్ వర్సిటీకి ‘నూతన’ శోభ

- జంతలూరు వద్ద అందుబాటులోకి అత్యాధునిక క్యాంపస్
- పూజలు నిర్వహించి అకడమిక్ బ్లాక్ ప్రారంభించిన వీసీ కోరి



సెంట్రల్ యూనివర్సిటీ అకడమిక్ బిల్డింగ్ వద్ద వీసీ ఎస్ఏ కోరి, మాజీ ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ ‘నూతన’ శోభ సంతరించుకుంది. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న వర్సిటీ శాశ్వత భవనం అందుబాటులోకి వచ్చింది. గురువారం క్యాంపస్‌లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి వీసీ ఎస్ఏ కోరి చేతుల మీదుగా అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ నెల 12 నుంచి శాశ్వత క్యాంపస్‌లోనే తరగతులు నిర్వహించనున్నారు. శాశ్వత క్యాంపస్ అందుబాటులోకి రావడం గర్వకారణమని వీసీ అన్నారు. కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, వర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మూడు వర్సిటీలతో ‘అనంత’ చరిత్ర

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా సెంట్రల్ యూనివర్సిటీని జిల్లాకు కేటాయించారు. 2018లో వర్సిటీ ఏర్పాటైంది. జేఎన్‌టీయూ (ఏ)లో తాత్కాలిక క్యాంపస్ ఏర్పాటు చేశారు. అక్కడే పాలక భవనంతో పాటు తరగతులు నిర్వహించారు. రెండు సంవత్సరాల క్రితం తరగతుల నిర్వహణను సీఆర్ఐటీ కళాశాలకు మార్చగా, పాలనా కార్యకలాపాలు మాత్రం జేఎన్‌టీయూ నుంచే కొనసాగాయి. ఈ క్రమంలోనే జంతలూరు వద్ద శాశ్వత క్యాంపస్ అందుబాటులోకి వచ్చింది. ఎక్కడా లేని విధంగా రెండు రాష్ట్ర వర్సిటీలు, ఒక సెంట్రల్ యూనివర్సిటీతో అనంతపురం జిల్లా చరిత్రలో చోటు దక్కించుకుంది.

ప్రధాని మోదీకి ఆహ్వానం..

జంతలూరు వద్ద 491.30 ఎకరాల్లో సెంట్రల్ యూనివర్సిటీ భవనాలు నిర్మిస్తున్నారు. తొలి దశలో రూ.350 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ.250 కోట్లు ఖర్చు చేశారు. పాలక భవనం, బాలికల హాస్టల్, బాలుర హాస్టళ్లు రెండు, అకడమిక్ బ్లాక్‌లు రెండు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి. అక్టోబర్‌లోపు పూర్తి కానున్నాయి. ఆ భవనాల ప్రారంభానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు. ప్రధాని వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇక.. వర్సిటీకి రెండో దశలో రూ.450 కోట్లు మంజూరు కానుంది. ఈ నిధులతో స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆడిటోరియం, సెంట్రల్ లైబ్రరీ, స్టాఫ్ క్వార్టర్స్, బాలికల హాస్టల్ సెకెండ్ బ్లాక్, రెండు అకడమిక్ బ్లాక్స్ నిర్మించనున్నారు.

20 రాష్ట్రాల నుంచి విద్యార్థులు..

ప్రస్తుతం సెంట్రల్ వర్సిటీలో 20 రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. యూజీ, పీజీలో 24 కోర్సులు నిర్వహిస్తున్నారు. పీహెచ్‌డీ ప్రోగ్రాం ఆరు సబ్జెక్టుల్లో ప్రవేశపెట్టారు.

సాయిరత్న ఆస్పత్రికి రూ.80 వేల జరిమానా

- బాధితుడికి ఆ మొత్తాన్ని అందజేయాలని కలెక్టర్ ఆదేశం
- నెట్‌వర్క్ ఆస్పత్రుల నిర్లక్ష్యంపై ఫిర్యాదుకు ఫోన్ నంబర్ ఏర్పాటు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: రోగికి వైద్యమందించడంలో నిర్లక్ష్యం చేసిన నగరంలోని సాయి రత్న ఆస్పత్రికి కలెక్టర్ వినోద్‌కుమార్ రూ. 80 వేల జరిమానా విధించారు. ఆ మొత్తాన్ని బాధిత రోగికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ‘ఎన్టీఆర్ వైద్యసేవ’ పథకంలో భాగంగా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక కేసును కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. సాయిరత్న ఆస్పత్రిపై గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన వరలక్ష్మి, చిదంబరయ్య దంపతులు ఫిర్యాదు చేశారని చెప్పారు. తమ విచారణలో ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యం బయటపడిందన్నారు. దీనిపై నివేదికను కలెక్టర్ అందజేయగా... జరిమానా వసూలు చేసి, ఆ మొత్తాన్ని చిందబరయ్యకు అందించాలని ఆయన సూచించారు. అంతే కాకుండా బాధితుడికి అదే ఆస్పత్రిలో ఉచితంగా ఫిజియోథెరపీ చేయించాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లోకి మధ్యవర్తులను అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి ఆస్పత్రులు, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఇబ్బంది పెట్టినా, సమస్య ఉన్నా కో ఆర్డినేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నంబర్ 08554-247266కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆయుష్మాన్ భారత్-ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధిక కేసులకు చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకం కింద జిల్లా వ్యాప్తంగా 6,76,813 మంది లబ్ధిదారులను నమోదు చేయాల్సి ఉండగా, ఈ ఏడాది మార్చి 15 నాటికి 6,27,041 మంది (92.6 శాతం) లబ్ధిదారుల నమోదు పూర్తయిందన్నారు. పథకంలో నమోదైతే దేశవ్యాప్తంగా వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఈబీదేవి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, డీపీఎం రవిశంకర్, కమిటీ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్ఓ గుర్తింపు గొప్ప ఘనత

అనంతపురం అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ 9001:2015 (ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) సర్టిఫికెట్ లభించడం గొప్ప ఘనత అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లాలో ఇప్పటికే గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. తాజాగా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ) కార్యాలయం, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయం, అనంతపురం- హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) కార్యాలయం, మహిళా శిశు సంక్షేమ కార్యలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్ లభించింది. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను సీపీఓ అశోక్‌కుమార్ అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందాలంటే 39 రకాల ప్రమాణాలను ప్రభుత్వ కార్యాలయాలు పాటించాల్సి ఉంటుందన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లోనూ దౌర్జన్య కాండ



తోపుదుర్తి గ్రామంలో పాఠశాలలోకి వెళ్లకుండా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు తల్లిదండ్రులను అడ్డుకుంటున్న పోలీసులు



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన మహంతపురంవాసి అజ్జయ్య

అనంతపురం ఎడ్యుకేషన్/కళ్యాణదుర్గం రూరల్: విద్యాభివృద్ధిలో కీలకంగా ఉండే పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లోనూ టీడీపీ దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడింది. అన్ని స్కూళ్లలోనూ టీడీపీ మద్దతుదారులే ఉండాలని పట్టుబట్టారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఎక్కువగా ఉన్నచోట్ల పోలీసులతో తమకు అనుకూలం చేయించుకున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా 1,741 పాఠశాలలకు గాను 1,712 పాఠశాలల్లో కమిటీలను ఎన్నుకున్నారు. కోరం లేని కారణంగా 29 స్కూళ్లల్లో వాయిదా పడింది. 971 స్కూళ్లల్లో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, 741 పాఠశాలల్లో ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. వాయిదా పడిన పాఠశాలల్లో తదుపరి ఎన్నికల తేదీని ప్రకటిస్తామని అధికారులు తెలిపారు.

‘తోపుదుర్తి’లో పోలీసుల సమక్షంలో...

రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలో పోలీసులు దగ్గరుండి టీడీపీ మద్దతుదారుల ఎన్నికకు సహకరించారు. ఇక్కడ స్వయంగా అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి పర్యవేక్షించడం విశేషం. తోపుదుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 132 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఉండగా ఇందులో 76 మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే. తక్కిన 56 మంది టీడీపీ మద్దతుదారులు. వీరిని మాత్రం పాఠశాలలోకి అనుమతించిన పోలీసులు శాంతి భద్రతల పేరుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను అనుమతించలేదు. టీడీపీ మద్దతుదారులతోనే ఎన్నిక పూర్తి చేసి, ఆ తర్వాత అనుమతించారు.

బండారు శ్రావణికి షాక్..

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణికి ఆమె స్వగ్రామం సిద్ధరాంపురంలో టీడీపీలోని మరో వర్గం షాక్ ఇచ్చింది. నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుల వర్గం ఏకపక్షంగా గెలిచింది. ఇక్కడి జిల్లా పరిషత్ పాఠశాలలో మొత్తం 24 మంది సభ్యులను ఎన్నుకోగా ఇందులో 23 మంది ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం వారే ఉండడం విశేషం. ఈ క్రమంలో ఎన్నిక ప్రక్రియ నిలిపేయాలంటూ మహిళా హెచ్‌ఎంపై ఎమ్మెల్యే వర్గం వారు తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేశారు. ఒకానొక సందర్భంలో ‘నువ్వు రేపటి నుంచి ఎలా పని చేస్తావో చూస్తాం’ అంటూ తీవ్రస్థాయిలో బెదిరించడంతో ఆమె కన్నీటిపర్యంతమయ్యారని తల్లిదండ్రులు తెలిపారు. ఇక.. కుందుర్పి మండలం మహంతపురం ప్రాథమికోన్నత పాఠశాల ఎన్నికల్లో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీకి చెందిన అజ్జయ్యపై దాడికి దిగారు. టీడీపీకి చెందిన ఈరన్న, శరణప్ప, సోమనాథ్, నరసింహమూర్తి దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారు. దాడిలో అజ్జయ్య తలకు గాయాలయ్యాయి.కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ఆసుపత్రికి తీసుకెళ్లారు.

టీడీపీ మండల కన్వీనర్ ప్రలోభాలు

బ్రహ్మసముద్రం: మండలంలోని పలు పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు హల్‌చల్ చేశారు. సభ్యులను ప్రలోభాలకు గురి చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. పలు చోట్ల ఎవరిని ఎన్నుకోవాలో దిక్కుతోచక వెనుదిరిగారు.

జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణమ్మ

బెళుగుప్ప: జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు చేరుతున్నాయి. హంద్రీనీవా ద్వారా గురువారం రిజర్వాయర్‌కు నీరు చేరుకున్నాయి. డ్యాం గరిష్ట సామర్థ్యం 1.68 టీఎంసీలు రాగా, ప్రస్తుతం 0.24 టీఎంసీల నీరు నిల్వ ఉందని రిజర్వాయర్ ఏఈ సప్తర్దీన్ పేర్కొన్నారు. జలాశయం పూర్తిస్థాయిలో నిండిన తరువాత హంద్రీనీవా సెకెండ్ ఫేజ్‌కు నీరు విడుదల చేస్తామని తెలిపారు.



జీడిపల్లి రిజర్వాయర్ సమీపంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా తరలివస్తున్న కృష్ణాజలాలు

క్లుప్తంగా

జిల్లాకు 947 మెట్రిక్ టన్నుల ఎరువులు



ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు జిల్లాకు అవసరమైన ఎరువులు సరఫరా అవుతున్నట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. గురువారం ఆయన స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను పరిశీలించారు. స్పిక్ కంపెనీ నుంచి 338 మెట్రిక్ టన్నుల యూరియా, 379 మెట్రిక్ టన్నుల డీఏపీ, 230 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్... మొత్తంగా 947 మెట్రిక్ టన్నులు ఎరువులు వచ్చాయన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం ఆర్‌ఎస్‌కే, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేస్తామన్నారు. మిగిలినవి కంపెనీ, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణికురాలి బంగారు నగల అపహరణ



బాధితురాలు నాగవేణి

గుత్తి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బ్యాగ్‌లోని బంగారు నగలను దుండగులు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం యాలేరు గ్రామానికి చెందిన నాగవేణి గురువారం సాయంత్రం అనంతపురం, గుత్తి మీదుగా గుంతకల్లుకు ప్రయాణమైంది. ఈ క్రమంలో గుత్తిలో బస్సు మారిన ఆమె కొంత దూరం వెళ్లిన తర్వాత తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచిన నాలుగున్నర తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. నగలు చోరీకి గురైనట్లు నిర్ధారించుకున్న ఆమె రాత్రి గుత్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అర్హత లేకున్నా అందలం!

ఆయనొక సాధారణ ఇంజినీర్. ఐదేళ్లకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అడ్డుగోలుగా దోచేశారు. రూ.కోట్లకు పడగలెత్తారు. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడడంతో తనంతట తనే పనీపాట లేని పోస్టులోకి వెళ్లిపోయారు. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఆయనకు రెక్కలొచ్చేశాయి. సహాయ ఇంజినీరే అయినా.. డివిజన్ ఇంజినీర్ పోస్టుపై కన్నేసి ఓ ప్రజాప్రతినిధి అండతో దక్కించుకున్నారు. పక్క జిల్లాలోని క్వాలిటీ సెల్ విభాగంలో పని చేస్తూ మళ్లీ పాత జిల్లాకు చేరుకున్నారు. ఇప్పుడు కీలక పోస్టులో ఉన్న ఆయన... తన సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి పేరు చెప్పి దందాను మొదలు పెట్టేశారు.

తన రెగ్యులర్ సీటుకు వద్దామనుకున్న డీఈఈకి ఇక్కడా మరొకరు అడ్డు పడ్డారు. మరో ఎనిమిది నెలల్లో తాను ఉద్యోగ విరమణ పొందుతున్నానని, అప్పటి వరకు ఇక్కడి నుంచి కదలనంటూ మొండికేశారు. సంతకాలు, జీతాలు చేసుకుంటూ ఉండమని చెప్పి సర్దుబాటు చేశారు. కీలక బాధ్యతలన్నీ సహాయ ఇంజినీర్ చూసుకుంటుంటే.. సంతకాలు, ఉద్యోగుల జీతాల పని మాత్రం రెగ్యులర్ డీఈకి అప్పగించడం విడ్డూరంగా ఉందని శాఖలో ప్రస్తుతం జోరుగా చర్చ సాగుతోంది.



అనంతపురంలోని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం

- పంచాయతీరాజ్ శాఖలో కీలక సీట్లపై కన్ను
- డిప్యుటేషన్ల పేరుతో కోరుకున్న సీట్లలో ఆసీనులు
- ప్రజాప్రతినిధుల అండతో డీఈఈ పోస్టులో ఏఈలు
- కార్యాలయ అడ్మిన్లుగా డీఈఈలు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్ శాఖలో సబ్ డివిజనల్ ఇంజినీర్లు(డీఈఈ), సహాయ ఇంజినీర్లు(ఏఈఈ) పోస్టులు చాలా కీలకం. కోట్లాది రూపాయల పనులు వీరి ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఆయా హోదాలను బట్టి అదనపు ఆదాయం కూడా భారీగానే ఉంటుంది. దీంతో ఈ పోస్టులను దక్కించుకునేందుకు కొందరు తమవంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏఈఈలు తమ పలుకుబడితో ఎఫ్‌ఏసీ వెసలుబాటును అస్త్రంగా చేసుకొని ఏకంగా డీఈఈ సీట్లలో తిష్ట వేస్తున్నారు. మరికొందరు డిప్యుటేషన్ల పేరుతో కోరుకున్న స్థానాల్లోకి సునాయసంగా చేరిపోతున్నారు. మరికొందరు ప్రజాప్రతినిధుల చుట్టూ, ఇంకొందరు రాజధాని చుట్టూ తిరుగుతూ తమవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

డిప్యుటేషన్ల పేరుతో మార్పు, చేర్పులు..

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్వాలిటీ సెల్ విభాగంలో పని చేసిన సహాయ ఇంజినీర్ (ఏఈ) ఒకరు అనంతపురం పీఆర్‌ఐ సబ్ డివిజన్-1కు ఇన్‌చార్జ్ డీఈఈ(ఎఫ్‌ఏసీ) హోదాలో వచ్చి వాలిపోయారు. ఈ ప్రభుత్వం మాది అనే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి అండతో చాలా సులువుగా డీఈఈ (ఎఫ్‌ఏసీ) పోస్టును దక్కించుకున్నారు. ఇప్పటి వరకూ ఆ పోస్టులో కొనసాగిన డీఈఈ తన పాత పోస్టు అయిన పీఐయూ సబ్ డివిజన్‌కు వెళ్లక తప్పలేదు. అయితే ఇక్కడికి వచ్చాక.. ఇప్పటి వరకూ ఆ పోస్టులో ఇన్‌చార్జ్ డీఈగా కొనసాగుతున్న మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన సహాయ ఇంజినీర్ ఆ సీటు వదిలేందుకు ఇష్టపడటం లేదు. తన రిటైర్డ్‌మెంట్ మరి కొన్ని నెలలే ఉండడంతో అప్పటి వరకూ ఆ పోస్టులోనే కొనసాగుతానని భీష్మించారు. అయితే ఈ వ్యవహారం రెండు జిల్లాల్లో తీవ్ర చర్చకు దారి తీయడంతో చివరకు ఆ శాఖ ముఖ్య అధికారి కల్పించుకుని దుప్పటి పంచాయితీతో ఆ డీఈకి ఉద్యోగుల జీతాల చెల్లింపు బాధ్యతలు అప్పగించారు. కీలకమైన పనుల పర్యవేక్షణ బాధ్యతను ఎఫ్‌ఏసీ హోదాలో కొనసాగుతున్న ఏఈకి అప్పగించారు. అలాగే పీఆర్‌ఐ సబ్ డివిజన్-2 రెగ్యులర్ డీఈకు కేవలం అడ్మిన్ (ఉద్యోగుల జీతాల బిల్లులు పెట్టే బాధ్యత) బాధ్యతలు అప్పగించి, పనుల పర్యవేక్షణ బాధ్యత ఉరవకొండ డీఈకి అప్పగించారు. ఆయన ఇప్పటికే ఉరవకొండ రెగ్యులర్ డీఈఈగా కొనసాగుతుండగా, అదనంగా అనంతపురం పీఆర్‌ఐ-2 బాధ్యతలు అప్పగించడం గమనార్హం.

ఏడు సబ్ డివిజన్లు ఉండగా..

పంచాయతీరాజ్ శాఖలో మొత్తం ఏడు సబ్ డివిజన్లు ఉన్నాయి. ఇందులో అనంతపురం-1 (అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాలు), అనంతపురం-2(శింగనమల), తాడిపత్రి, గుత్తి, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం సబ్ డివిజన్‌లు ఉన్నాయి. ఇందులో అనంతపురం-1, తాడిపత్రి సబ్ డివిజనల్ అధికారులుగా అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈలు) ఎఫ్‌ఏసీ కింద డీఈఈలుగా కొనసాగుతున్నారు. మిగిలిన వారిలో కనీసం ఐదుగురు త్వరలో జరిగే బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లనున్నారు.

ప్రక్షాళన చేయాల్సిందే..

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పంచాయతీరాజ్ శాఖలో పరిణామాలు ఊహించని విధంగా మారిపోతున్నాయి. ఇన్నాళ్లూ లూప్‌లైన్‌లో ఉన్న అధికారులు ఇప్పుడు తాము కోరుకున్న కీలకమైన పోస్టుల్లోకి వచ్చి చేరిపోతున్నారు. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకున్నా.. డిప్యుటేషన్ల పేరుతో కీలక పోస్టుల్లో కర్చీఫ్ వేసేస్తున్నారు. అనంతరం రాజధానిలోని ఈఎన్‌సీ కార్యాలయం నుంచే డిప్యుటేషన్ ఉత్తర్వులు తెచ్చుకుని చేరిపోతున్నారు. ఒకరిద్దరు డిప్యుటేషన్లపై వచ్చిన వారు లేనిపోని రాజకీయాలు చేస్తూ కార్యాలయాల్లోని వాతావరణాన్ని చెడగొడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరందరికీ పంచాయతీరాజ్ శాఖ పునరావాస కేంద్రంగా మారిందంటూ ఆ శాఖ బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ ప్రక్షాళన జరిగితే గానీ అనుకున్న మేర అభివృద్ధి సాధ్యం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వైఎస్ జగన్‌ను కలసిన విశ్వ



ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉరవకొండ నియోజకవర్గంలోని తాజా పరిస్థితులను వైఎస్ జగన్‌కు వివరించినట్లు విశ్వ తెలిపారు. ఈ సందర్భంగా వారి వెంట పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సీపీ వీరన్న, వైఎస్సార్‌ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, రైతు విభాగం రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి ఉన్నారు.

ఉత్కంఠ పోరులో తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ విజయం

- హోరాహోరీగా సాగుతున్న బాలికల ఫుట్‌బాల్ టోర్నీ
- నేడు తొలి సెమీఫైనల్



తొలి సెమీఫైనల్‌కు చేరుకున్న జార్ఖండ్ జట్టు

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా జాతీయ స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. గురువారం జరిగిన ఉత్కంఠ పోరులో తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. కేరళ జట్టుతో తలపడిన తమిళనాడు జట్టు 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. 2-0 గోల్స్ తేడాతో గుజరాత్‌పై అరుణాచల్ ప్రదేశ్ జట్టు గెలుపొందింది. శుక్రవారం ఉదయం తమిళనాడు-జార్ఖండ్ జట్ల మధ్య తొలి సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.వేణుగోపాల్ తెలిపారు.

కొత్త చట్టాలను ఉపసంహరించుకోవాలి

అనంతపురం: కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. డిమాండ్ సాధనలో భాగంగా అనంతపురం జిల్లా కోర్టు బయట ఐలూ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నిరసన తెలిపారు. కార్యక్రమానికి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ మద్దతు తెలిపారు. ఐలూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వీర, ఎం.సతీష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జూలై 1న కేంద్ర ప్రభుత్వం నూతన క్రిమినల్ చట్టాలను దేశ వ్యాప్తంగా అమలులోకి తెచ్చిందన్నారు. నూతన చట్టాలను ప్రవేశపెట్టేటప్పుడు న్యాయవాదులు, ప్రజలు, మేధావులు, పార్లమెంట్ సభ్యులతో ఎలాంటి చర్చలూ జరపలేదన్నారు. అంతేకాక పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించేటప్పుడు ప్రతిపక్షాలకు చెందిన 146 మంది ఎంపీలను సస్పెండ్ చేసి ఏకపక్షంగా మోదీ ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఇవి పౌరుల హక్కులు, వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. ఈ చట్టాల్లో జ్యుడీషియల్ అధికారాలను తగ్గించి ఎగ్జిక్యూటివ్, పోలీసులకు ఎక్కువ అధికారాలు ఇవ్వడం జరిగిందన్నారు. అరెస్ట్ చేసే సమయంలో బేడీలు వేసే విధానాన్ని కొత్త చట్టంలో రూపొందించారన్నారు. సాక్ష్యాలను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా వినియోగించుకునే అవకాశం కల్పించారని, ప్రజల స్వేచ్ఛను, స్వతంత్రతను, వాక్ స్వాతంత్ర్యాన్ని, సమావేశమయ్యే హక్కును, సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కును, నిరసన ప్రదర్శించే హక్కును కొత్త చట్టాలు హరిస్తున్నాయన్నారు. న్యాయనిపుణులతో చర్చ జరిగే వరకూ ఈ చట్టాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే బెంగాల్ ప్రభుత్వం ఈ మూడు క్రిమినల్ చట్టాలను అమలు చేయరాదంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందన్నారు. ఇదే తరహాలోనే ఏపీలోని కూటమి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేసి, నూతన చట్టాల నిలుపుదలకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఐలూ నాయకులు బీసీ ప్రకాష్, పురుషోత్తం, నాగరాజు, కమిటీ సభ్యులు అశోక్, సురేష్, అశోక్ నాయక్, ధర్మేంద్ర, చంద్రశేఖర్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐలూ నాయకులు

అన్ని కమిటీలు లక్ష్యాన్ని అధిగమించాలి

- మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజనేయులు ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని మార్కెటింగ్ కమిటీలు ఈ ఏడాది నిర్దేశిత లక్ష్యాన్ని వంద శాతం అధిగమించాలని ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ)సి.రామాంజనేయులు ఆదేశించారు. మార్కెట్ ఫీజు వసూళ్లపై అనంతపురంలోని మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్‌ఎన్ మూర్తి, అనంతపురం యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మితో పాటు సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో గురువారం ఆయన సమీక్షించారు. జూలై నెలాఖరుతో ముగిసిన నాలుగు నెలల కాలంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 17 మార్కెట్ కమిటీలు, 30 చెక్‌పోస్టులకు నిర్ధేశించిన పన్ను వసూళ్ల ప్రగతిపై ఆరా తీశారు. అనంతపురం, శింగనమల, ఉరవకొండ, మడకశిర, తనకల్లు మార్కెట్ కమిటీల పరిధిలో వసూళ్లు ఆశాజనకంగా ఉండగా ధర్మవరం, గుత్తి, గుంతకల్లు, రాప్తాడు కమిటీల్లో వసూళ్ల పరిస్థితి దారుణంగా ఉందంటూ అసహనం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో రూ.12.06 కోట్లకు గానూ 30 శాతంతో రూ.3.56 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్లకు గానూ 29 శాతంతో రూ.1.52 కోట్లు వసూలైందని తెలిపారు. విజిలెన్స్ చర్యలు చేపట్టి చెక్‌పోస్టులు, యార్డుల్లో పన్ను వసూళ్ల, ఆదాయ వనరులు పెంచాలని ఆదేశించారు. అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సేవా కార్యక్రమాలు, పశువులు, జీవాల సంతల గురించి తెలుసుకున్నారు. అంతకు మునుపు పీఏసీ ఇన్‌చార్జి హోదాలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన సందర్శించారు.



అధికారులతో సమీక్షిస్తున్న రామాంజనేయులు

వివాహిత బలవన్మరణం

గార్లదిన్నె: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. గార్లదిన్నె మండలం కనుంపల్లికి చెందిన వైష్ణవి (26)కి ఐదు నెలల క్రితం అనంతపురం రూరల్ మండలం మన్నీలకు చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో వివాహమైంది. జూన్ 29న పుట్టింటికి వచ్చిన ఆమె తిరిగి అత్తారింటికి వెళ్లలేదు. ఈ క్రమంలో ఈ నెల 2న ఇంట్లోనే పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. కాగా, ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

పశుగణన పక్కాగా చేపట్టండి

- పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం

ఉరవకొండ: వచ్చే నెల 1 నుంచి మొదలు కానున్న పశుగణన కార్యక్రమాన్ని పక్కా గణాంకాలతో నమోదు చేయాలని సంబంధిత అధికారులను పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ సుబ్రహ్మణ్యం సూచించారు. పశుగణనపై గురువారం ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్ పరిధిలోని పశుగణన సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు స్థానిక లయన్స్ క్లబ్ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని ఉరవకొండ, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, శెట్టూరు, కంబదూరు ప్రాంతాలకు చెందిన 72 మంది ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

వారికి పని భారం.. వీరికి కాలక్షేపం

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఏడుగురు సెక్టోరియల్ ఆఫీసర్లను గత నెల 31న రీప్యాట్రేషన్ చేశారు. వీరిలో ఏఎంఓ, సీఎంఓ మాత్రం రిలీవ్ కాకుండా తాత్కాలికంగా అక్కడే పని చేస్తున్నారు. తక్కిన ఐదుగురు సెక్టోరియల్స్ ఈ నెల 1 నుంచి రోజూ డీఈఓ కార్యాలయానికి వచ్చి సంతకాలు చేసి చెట్ల కింద ఉంటూ సాయంత్రం ఇంటికి వెళ్తున్నారు. ఇప్పటిదాకా వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. సమగ్రశిక్షలో పనిభారంతో ఉన్న ఒకరిద్దరు అల్లాడిపోతున్నారు. ఆ పోస్టులు భర్తీ అయ్యేవరకు సమగ్ర శిక్ష కార్యక్రమాలు కుంటుపడడం ఖాయమని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

రీప్యాట్రేషన్‌కు కలెక్టర్‌కు.. పోస్టింగ్‌లకు తనే ఉత్తర్వులు!

సమగ్ర శిక్ష కార్యాలయంలో ఫారెన్ సర్వీస్ కింద పని చేస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను రీప్యాట్రేషన్ కోసం కలెక్టర్‌కు ఫైలు పెట్టిన అధికారులు వారికి పోస్టింగ్‌లు మాత్రం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లకుండానే ఇచ్చేశారు. సమగ్ర శిక్షలో సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న జిలాన్, గాయత్రిదేవిని గత నెల 31న కలెక్టర్‌తో రీప్యాట్రేషన్ చేయించారు. వారిద్దరికీ గురువారం డీఈఓ కార్యాలయంలో పోస్టింగ్‌లు ఇస్తూ డీఈఓ వరలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న షబీనా బేగం, మధుసూదన్‌రావును సమగ్ర శిక్షకు ఫారెన్ సర్వీస్ కింద పంపారు. అయితే సీనియర్ అసిస్టెంట్ల రీప్యాట్రేషన్ ఫైలు కలెక్టర్‌కు పంపి కొత్త సంప్రదాయానికి తెర తీయడంపై చర్చ జరుగుతోంది.

రైల్వే కూలీ ఆత్మహత్య

గుత్తి: జీవితంపై విరక్తితో ఓ రైల్వే కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వాసు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మనోహర్ (23) గుత్తి జీఆర్పీ పరిధిలో రైల్వే కూలీ (ప్యాకింగ్ మిషన్)గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే తన ఆరోగ్యం ఇక కుదట పడదని తెలుసుకుని జీవితంపై విరక్తితో గురువారం ఉదయం రాయలచెరువు రైల్వే స్టేషన్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

గుంతకల్లు రూరల్: మండలంలోని గుండాలతండాకు చెందిన సేవ్యానాయక్ (45) హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధం మోజులో ప్రియుడితో కలసి సేవ్యానాయక్‌ను భార్యనే హతమార్చినట్లుగా విచారణలో నిర్ధారణ కావడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ దుగ్గిరెడ్డి వెల్లడించారు. ఈ నెల 5న సేవ్యానాయక్ హత్య విషయం తెలిసిందే. తనకున్న మూడెకరాల పొలంలో భార్య లలితమ్మతో కలసి వ్యవసాయంతో పాటు కూలి పనులు, బేల్దారి పనులతో జీవనం సాగిస్తుండేవాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా లలితమ్మ అదే గ్రామానికి చెందిన కృష్ణానాయక్‌తో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నట్లుగా గుర్తించిన సేవ్యానాయక్ పలుమార్లు ఆమెను మందలించాడు. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఈ నెల 5న కూలి పనుల నుంచి తిరిగొచ్చిన లలితమ్మ మధ్యాహ్నం తమ పొలం వద్దకెళ్లింది. కాసేపటి తర్వాత కూలి పనుల నుంచి ఇంటికి చేరుకున్న సేవ్యానాయక్... తన భార్య పొలానికి వెళ్లిన విషయం తెలుసుకుని ఆమెకు సద్ది తీసుకుని వెళ్లాడు. అప్పటికే లలితమ్మ, కృష్ణానాయక్ ఇద్దరూ పొలంలో కలసి ఉండడం గమనించిన సేవ్యానాయక్‌లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. వివాహేతర సంబంధం మంచిది కాదని చెప్పినా వినకుండా పరువు తీస్తున్నావంటూ ఆమెను కొట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో సేవ్యానాయక్‌ను కృష్ణానాయక్, లలితమ్మ రాళ్లతో కొట్టి హతమార్చారు. నేరాన్ని లలితమ్మ అంగీకరించడంతో గురువారం ఉదయం ఆమెతో పాటు కృష్ణానాయక్‌ను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

యువత క్రమశిక్షణతో ముందుకెళ్లాలి

అనంతపురం మెడికల్: విద్యార్థి దశ నుంచే యువత క్రమశిక్షణతో, ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లి సంస్కారవంతమైన జీవితం గడపాలని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జీ. శివ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం జిల్లా న్యాయ సేవా సంస్థ, వైద్య కళాశాల ఆధ్వర్యంలో కళాశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడరాదన్నారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. మహిళల అక్రమ రవాణా అత్యంత నేరమన్నారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడకుండా స్నేహపూర్వక వాతావరణంలో అందరితో కలసి మెలసి ఉండాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే జైలు శిక్షతో పాటు విలువైన విద్యార్థి జీవితం నాశనమయ్యే ప్రమాదం ఉందన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా ప్రతి ఒక్కరూ ఉత్తమ వైద్యులుగా ఎదగాలన్నారు. సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి కే శ్రీనివాసరావు, ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ నవీన్, ప్రొఫెసర్లు డాక్టర్ శంకర్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ దుర్గ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ సురళ, డాక్టర్ రేణుక, డాక్టర్ షబానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్

21 నుంచి అమూల్ పాలసేకరణ నిలిపివేత

కదిరి అర్బన్: జిల్లాలో ఈ నెల 21 నుంచి పాలసేకరణ నిలిపివేస్తున్నట్లు అమూల్ డైరీ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్ట్ 20 సాయంత్రం షిఫ్ట్ ముగిశాక జిల్లాలో పాలసేకరణ ఆగిపోతుందని వెల్లడించారు. అమూల్ డైరీ అనుబంధ బీఎంసీలు ఆగస్టు 21 నుంచి పాల సరఫరా చేయొద్దన్నారు. ఆంధ్రప్రదేశ్ పాల నిర్మూలనా నిబంధనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. రైతుల పాల చెల్లింపు తమ ప్రామాణిక ప్రక్రియ విధానంగా యథావిధిగా జరుగుతుందన్నారు. పాడి రైతులు, మహిళా డైరీ సంఘాల కార్యదర్శులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. ఈ విషయంపై మరింత స్పష్టత కోసం తమ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

వ్యక్తి దుర్మరణం



లక్ష్మీనారాయణ (ఫైల్)

పెనుకొండ రూరల్: కంటైనర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం పెనుబోలుకు చెందిన లక్ష్మీనారాయణ (35)కు భార్య లక్ష్మీనారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యులతో కలసి ధర్మవరం మండలం ఎర్రగుంటలో నివాసముంటూ పెనుకొండలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం వ్యక్తిగత పనిపై పెనుకొండ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆయన... మార్గం మధ్యలో కియా పరిశ్రమ ఎదురుగా చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కంటైనర్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రంగడు యాదవ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి సర్పసూక్త క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో గురువారం నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుద్ధ చవితి సందర్భంగా స్వామికి సర్పసూక్త క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. నాగుల చవితి ప్రారంభం కావడంతో ఆలయ ప్రాంగణంలో భక్తులు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

14న వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: రామ్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 14న ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామికి పుష్పయాగం, అభిషేకంతో పాటూ శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం భారీ ఎత్తున నగరోత్సవ కార్యక్రమాలు కమనీయంగా జరుగుతాయని పేర్కొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బాలల సంరక్షణ సమితి కౌన్సిలర్ శివలత సూచించారు. గురువారం మండల పరిధిలోని కనుముక్కల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతన్నట్లు తెలిస్తే పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్వతి, సోషల్ వర్కర్ వనజాక్షి, ప్రసన్నలక్ష్మి, శ్రావణి, ఏఎన్ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జీవితం ఆదర్శప్రాయం



మాట్లాడుతున్న స్వామి అనుపమానంద మహారాజ్

అనంతపురం కల్చరల్: జగద్గురువు రామకృష్ణ పరమహంస జీవితం ఆదర్శప్రాయమని రామకృష్ణ మిషన్ స్వామి అనుపమానంద మహారాజ్ అన్నారు. గురువారం హెచ్చెల్సీ కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సేవా సమితి గుత్తి శ్రీధర మూర్తి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా రామకృష్ణ మిషన్ నుంచి విచ్చేసిన స్వామి అనుపమానంద మహారాజ్, స్వామి సన్నివాసానంద మహారాజ్, రాయదుర్గం సేవా సమితి నిర్వాహకుడు అర్చనానంద మహారాజ్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్యంగా రామకృష్ణ కథామృత పఠనం ద్వారా కథలు అందరిని ఆకట్టుకున్నాయి. సంధ్యామూర్తి బృందం పురంధరదాస కీర్తనలతో అలరించారు. రామకృష్ణ, వివేకానందులకు నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో సేవాసమితి నిర్వాహకులు డాక్టర్ కృష్ణశశి, వేదాద్రి ప్రవీణ్, శ్రీనిధి రఘు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

రాప్తాడు: మండలంలోని 37 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎంఈఓ మల్లికార్జున ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్నికల నియామవళిని ఎన్నికల పరిశీలకులు ఎస్ఎస్ఏ ఏఎంఓ చంద్రశేఖర్, ఇన్‌క్లూజివ్ కో–ఆర్డినేటర్ షమా, రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్నికలను పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల హెచ్ఎంల చేతుల మీదుగా ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు నియామక పత్రాలు అందజేశారు.

తోపుదుర్తిలో వాగ్వాదం..

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా 37 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. కోరమ్ లేక వడ్డుపల్లిలోని పాఠశాల, తోపుదుర్తి ప్రైమరీ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించలేదని ఎంఈఓ నరసింహారెడ్డి తెలిపారు. తోపుదుర్తి గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. తాము 76 మంది ఉన్నామని ఎందుకు పాఠశాలలోకి అనుమతించరని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు లోపలికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఉపాధ్యాయులు కూడా వీరికి మద్దతు పలుకుతూ ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారు.



నాగుల ప్రతిమలకు దారం చుడుతున్న దృశ్యం



నగరంలోని చెరువు కట్టపై భక్తుల పూజలు



పాలు పోస్తున్న మహిళ

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నాగుల చవితి పర్వదినాన్ని గురువారం నగరవాసులు కన్నుల పండువగా జరుపుకున్నారు. శ్రావణంలో వచ్చిన తొలి పండుగ కావడంతో భక్తులు ఆలయాలకు తరలివెళ్లారు. పీటీసీ, లక్ష్మీనగర్, సాయిబాబా కళాశాల ప్రాంగణం, పాతూరు చెరువుకట్ట తదితర చోట్ల నాగుల కట్టల వద్ద పూజలు చేశారు. పవిత్ర కంకణాలు ధరించి పుట్టల్లో నూలు బియ్యం, దంచిన చలిబిండి, పాలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి నాగదేవతలను ఆరాధించుకున్నారు. పుట్టమన్ను ఆరోగ్యానికి మంచిదనే భావనతో పాలు పోసిన మట్టిని ఇళ్లకు తీసుకెళ్లారు. అలాగే స్థానిక ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, మారుతీ నగర్‌లోని రామాలయం, లక్ష్మీనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆవుపాలతో నాగస్వరూపాలను అభిషేకించారు. శుక్రవారం గరుడ పంచమి వేడుకలు ఘనంగా జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

– అనంతపురం కల్చరల్:



నాగ ప్రతిమలకు పసుపు, కుంకుమ పెడుతున్న మహిళ



దీపారాధన చేస్తున్న దృశ్యం

హెల్మెట్ తప్పనిసరి



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించిన అధికారులు

అనంతపురం: వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించడం తప్పనిసరి అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ వీర్రాజు తెలిపారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్–2 విభాగం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం వల్ల తీవ్రమైన గాయాల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. కొద్దిపాటి నిర్లక్ష్యంతో ప్రాణాలు పోగొట్టుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్, మోటార్ వెహికల్‌లో ప్రయాణిచేటప్పుడు హెల్మెట్ పెట్టుకుంటే తలకు బలమైన గాయాలు తగిలే అవకాశం తక్కువని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, ప్రొఫెసర్ టి.బాలనరసయ్య, డాక్టర్ ఓంప్రకాష్, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ జి.మమత, డాక్టర్ కళ్యాణి రాధ, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శారద, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమయోధుడు ఎంవీ రమణ

అనంతపురం అర్బన్: సీపీఐ సీనియర్ నేత ఎంవీ రమణ గొప్ప ఉద్యమయోధుడని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఎంవీ రమణ బుధవారం మరణించిన విషయం విధితమే. ప్రజల సందర్శనార్థం గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఉంచిన ఆయన మృతదేహాన్ని అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీమ్ సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఎంవీ రమణతో తనకున్న అనుబంధాన్ని అనంత వెంకటరామి రెడ్డి గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శి సి.జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, నగర కార్యదర్శి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు ఎంవీ రమణ మృతదేహం

సీపీఐ కార్యాలయం నుంచి అనంతపురం వైద్య కళాశాల వరకు ఎంవీ రమణ అంతిమ యాత్ర నిర్వహించారు. అనంతరం కళాశాల యాజమాన్యానికి ఎంవీ రమణ మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో నాయకులు అప్పగించారు.



ఎంవీ రమణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ఎంవీ రమణ సేవలు అమూల్యం

అనంతపురం కల్చరల్: జిల్లా కమ్యూనిస్టు యోధుడు ఎంవీ రమణ సామ్యవాద ప్రపంచం కోసం కలలు కనేవారు. ప్రజల కోసం చాలా పోరాటాలు చేశారని సీనియర్ రచయిత, విరసం (విప్లవ రచయితల సంఘం)మాజీ సభ్యుడు జెట్టి జైరాం అన్నారు. ఎంవీ రమణ మృతికి సంతాపం ప్రకటిస్తూ గురువారం ఓ ప్రకటన విడదల చేశారు. నిరాడంబరుడు, విద్యావంతుడైన రమణ భౌతికంగా లేకపోయినా ఆయన సిద్ధాంతాలు కొనసాగేలా చూడాల్సిన బాధ్యత మేధావులందరిపై ఉందన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని విచారం వ్యక్తం చేశారు.

తాత్కాలిక డ్రైనేజీ నిర్మించేందుకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని సప్తగిరి సర్కిల్ వద్ద మురుగు రోడ్డుపైకి రాకుండా తాత్కాలికంగా డ్రైనేజీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, నగరపాలక సంస్థ అధికారులతో కలసి లలిత కళా పరిషత్ సమీపంలో సమస్యగా మారిన డ్రైనేజీని పరిశీలించారు. జాతీయ రహదారి వెడల్పు చేయడంలో భాగంగా అనంతపురంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. లలిత కళాపరిషత్ నుంచి జిల్లా గ్రంథాలయం వరకు డ్రైనేజీ రోడ్డు మీదకు రావడంతో వ్యాపారులు ఇబ్బందులకు గురైనట్లు తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఆలస్యం అవుతుండటంతో అప్పటి వరకు తాత్కాలికంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి సమస్య తీరుస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బాలాంజనేయులు, సైఫుల్లాబేగ్, నగరపాలక సంస్థ ఈఈ సూర్యనారాయణ, జాతీయ రహదారుల విభాగం సుధాకర్ రెడ్డి, డీఈ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ వసీం

ఎస్వీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

అనంతపురం ఎడ్యుకేషన్: సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ టాక్స్ అండ్ కస్టమ్స్ వారి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. అందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంటలోపే రక్తం అందించాల్సి ఉంటుందన్నారు. గర్భిణులకు ఆపరేషన్, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తం ఎంతో అవసరమవుతుందని పేర్కొన్నారు. కమర్షియల్ టాక్స్ ఏసీ జి.అనిత మాట్లాడుతూ.. రక్తదానం ఆరోగ్యకరమైన అలవాటు అన్నారు. అనంతరం చక్రధరరెడ్డి రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమర్షియల్ టాక్స్ కార్యాలయం సూపరింటెండెంట్ ఎస్.రంగనాయకులు, ఎల్.వీణా మృదుల, కె.ప్రశాంతి, జె.ప్రభుదాస్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ఏవీ ప్రసాద్, మోహన్‌కృష్ణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆర్గనైజర్, రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ ఎం.శివశంకర్, ఎన్ఎస్ఎస్ అధికారులు జి.ఆనంద్ బాబు, ఎస్.ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ చక్రధర రెడ్డి

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

అనంతపురం మెడికల్: బిడ్డ ఎదుగుదలకు తల్లి పాలు అమృతంలా పని చేస్తాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్న పిల్లల వార్డులో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాగించడం వల్ల బిడ్డకు మంచి పోషక విలువలు అందుతాయన్నారు. పసికందుకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. అదేవిధంగా రెండేళ్ల వరకు ఇతర ఆహారంతో పాటు తల్లిపాలు అందించవచ్చన్నారు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూజజ గత వారంలో రోజులుగా తల్లిపాల ప్రాముఖ్యతను తల్లులకు తెలియజేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ప్రొఫెసర్ డాక్టర్ సంధ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, వైద్యులు డాక్టర్ సంజీవప్ప, డాక్టర్ శంకర్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

మామిళ్లపల్లిలో..

కనగానపల్లి: బిడ్డ పుట్టిన తర్వాత తొలిసారిగా తల్లి ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. గురువారం మామిళ్లపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహార పదార్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



మామిళ్లపల్లిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న నాగుల నగరోత్సవం

అనంతపురం కల్చరల్: నాగుల చవితి పర్వదినాలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నగరవీధుల్లో నాగుల నగరోత్సవం నయనానందకరంగా సాగింది. స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయం వద్ద నాగజ్యోతి స్వరూపులు వెంకట ప్రసాద్ నేతృత్వంలో ప్రారంభమైన నాగుల రథోత్సవాన్ని ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీక ధర్మకర్త హోసూరు రామసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అనంతరం మొదటి రోడ్డు నుంచి కమలానగర్ వరకూ నాగ స్వరూపాలతో అలంకరించిన రథాల ఊరేగింపు సందడిగా సాగింది. పలు గ్రామాల నుంచి విచ్చేసిన కోలాటం, చెక్కభజన, గురవయ్యలు, కీలు గుర్రాలు, ఉరుములు, విచిత్ర వేషగాళ్లు, వీధి భాగవతం కళాకారులు తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నాగ దేవతలకు భక్తితో నీరాజనాలర్పించారు. రథాల ముందు వందలాది మంది భక్తులు నాగినీ నృత్యాలతో అలరించారు. దారి పొడుగునా జనం ఆసక్తిగా ఉత్సవాలను, కళాజాతను తిలకించారు.



గొరవయ్యల నృత్య ప్రదర్శన

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



వేరుశనగకు సోకే తెగుళ్లపై వివరిస్తున్న ఏడీఏ రవి

రాప్తాడు: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల అధిక దిగుబడులు సాధించవచ్చని అనంతపురం డివిజన్ ఏడీఏ రవి సూచించారు. గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో యోగానంద అనే రైతు సాగు చేసిన వేరుశనగ పొలంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరుశనగ పంట ఆశాజనకంగా ఉందని, తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారాలు అందుతాయని తెలిపారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసుకోవడానికి దరఖాస్తు పూరించి, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నంబర్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్ రెడ్డి, గొల్లపల్లి, మరూరు, ఎం.చెర్లోపల్లి రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో కురుస్తున్న వర్షం



వర్షంలోనే ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు

● జోరువాన

నగరంలో జోరువాన కురిసింది. గురువారం ఉదయం తేలికపాటి చిరుజల్లులు కురవగా.. సాయంత్రం ఎడతెరపి లేకుండా కురిసింది. ఈ ఏడాది జూన్ 10 నుంచి వర్షం కురవలేదు. వర్షం కురవడంతో నగరంలో చల్లని గాలులు వీచాయి. లోతట్టు ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, యువజన కాలనీ, గౌరవగార్డెన్, రజక్ నగర్, తదితర ప్రాంతాల్లో రాణినగర్, 4, 5వ రోడ్డు, అంబేడ్కర్ నగర్, తదితర ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరింది. అదేవిధంగా నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, ఆర్టీసీ బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది. జోరుగా వాన కురుస్తుండడంతో నగర మేయర్ వసీం ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అధికారులను అప్రమత్తం చేశారు. ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

– అనంతపురం కార్పొరేషన్:



జెడ్పీ డిప్యూటీ సీఈఓ కోసం చాంబర్ ఎదుట నిరీక్షిస్తున్న కార్మికులు

కార్మికులకు అందని వేతనాలు

- జెడ్పీలో ఇబ్బందులు పడుతున్న 21 మంది కార్మికులు
- నేటి నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు వెల్లడి

అనంతపురం సిటీ: స్థానిక జిల్లా పరిషత్‌లో 21 మంది పారిశుద్ధ్య కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు అందలేదు. కార్మిక కుటుంబాల్లో ఆకలి కేకలు మిన్నంటాయి. గౌరవ వేతనం కోసం అధికారులు, కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిన కార్మికులు కడుపు మండి విధుల బహిష్కరణకు సిద్ధమయ్యారు. జెడ్పీలో 11 మంది స్వీపర్లు ఉండగా, వంట మనుషులు ఇద్దరు, డ్రైవర్–1, గెస్ట్ హౌస్‌లో వాచ్‌మెన్–1, స్కావెంజర్స్–3, దోబీ–2, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రీషియన్లు–1 చొప్పున ఉన్నారు. పని గంటల పేరుతో ఒక్కో కార్మికుడికి ఏజెన్సీ ద్వారా రూ.280 చెల్లిస్తారు. అయితే ఏజెన్సీ నిర్వాహకులకు జెడ్పీ అధికారులు బిల్లులు ఆపేశారు. దీంతో కార్మికులకు ఏజెన్సీ నిర్వాహకులు డబ్బులు ఇవ్వలేకపోయారు.

నేటి నుంచి విధుల బహిష్కరణ

కొన్ని నెలలుగా వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్న అధికారుల తీరుకు నిరసనగా శుక్రవారం నుంచి తాము మూకుమ్మడిగా విధులను బహిష్కరిస్తున్నట్లు కార్మికులు గురువారం ప్రకటించారు. వేతనాలు పూర్తిగా చెల్లించే వరకు విధుల్లో చేరే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని వారు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కలసి తమ నిర్ణయాన్ని తెలియజేశారు. అక్కడి నుంచి సీఈఓ, డిప్యూటీ సీఈఓను కలిసేందుకు వెళ్లగా వారిద్దరూ అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.

ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావు ఏమంటున్నారంటే..

జెడ్పీలో పని చేసే 21 మంది కార్మికులకు కొన్ని నెలలుగా వేతనాలు రాని విషయం నా దృష్టికి వచ్చింది. నేను కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు కొత్తగా తీసుకున్నా. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కార్మికులందరికీ గౌరవ వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

ఎన్నాళ్లు పని చేయగలం?

మాకు ఇచ్చేదే అరకొర జీతాలు. నెలల తరబడి ఇవ్వకపోతే ఏం తిని బతకాలి? పెద్ద అధికారులకు తెలియదా? మా పై ఆధారపడిన కుటుంబ సభ్యులను ఎలా పోషించాలి. వేతనాల కోసం ఓపికగా ఎదురు చూశాం. ఇక మా వల్ల కాదు.

– కె.జయంతి, కార్మికురాలు, జెడ్పీ కార్యాలయం